ప్రజాశక్తి

ఆదివారం 19 మార్చి 2023 5 అనంతపురం



శింగనమల మండలం నాయనపల్లి క్రాస్ వద్ద అనంతపురం-తాడిపత్రి జాతీయ రహదారిపై రోడ్డుపై పడిన వడగండ్లు

టిడిపికే పట్టం



విజేత..
భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

- 7543 ఓట్ల మెజార్టీతో భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి గెలుపు
- రీ కౌంటింగ్‌కు పట్టుబట్టిన వైసిపి
- అంగీకరించని రిటర్నింగ్ అధికారి నాగలక్ష్మి
- టిడిపి గెలుపుతో తమ్ముళ్ల సంబరాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మూడు రోజుల పాటు ఉత్కంఠ భరితంగా సాగిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో ఓటర్లు టిడిపికి పట్టంగట్టారు. ఓట్ల లెక్కింపు ఫలితాలు శనివారం రాత్రికి పూర్తయ్యాయి. ఈ ఎన్నికలో 7543 ఓట్ల మెజార్టీతో టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, వైసిపి అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిపై విజయం సాధించారు. ఓట్ల లెక్కింపు ఆద్యంతం హోరాహోరీగా, ఉత్కంఠభరితంగా సాగింది. ప్రారంభం నుంచి టిడిపి, వైసిపిల మధ్య నువ్వా...నేనా అన్నట్టుగానే ఓట్ల లెక్కింపు జరిగింది. ద్వితీయ ఓట్ల బదలాయింపులో పిడిఎఫ్ అభ్యర్థి పోతుల నాగరాజు ఓట్లలో 9886 ఓట్లు టిడిపికి లభించడంతో విజయం సులభమైంది.

ఆద్యంతం పోటాపోటీ...

నియోజకవర్గం పరిధిలో మొత్తం 2,45,687 ఓట్లు పోలవగా 11 రౌండ్లలో జరిగిన తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు 19,239 ఓట్లు అనర్హమైనవి తొలగించారు. మిగిలిన 2,26,448 ఓట్లను లెక్కించారు. 49 మంది అభ్యర్థులు పోటీపడిన ఈ ఎన్నికల్లో ముగ్గురి మధ్యనే ప్రధానంగా ఓట్ల పంపిణీ జరిగింది. ఇందులో ప్రధానంగా వైసిపి, టిడిపిలకే పోటాపోటీగా ఓట్లు వచ్చాయి. ప్రథమ ప్రాధాన్యత ఓట్లు పూర్తయ్యే సమయానికి వైసిపి అభ్యర్థి వెన్నపూస గోపాల్‌రెడ్డికి 95,659 రాగా, టిడిపి అభ్యర్థి భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డికి 94,149 ఓట్లు వచ్చాయి. దీంతో వైసిపికి 1820 ఓట్ల మెజార్టీ లభించింది. ఇదే మెజార్టీ ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులోనూ కొనసాగింది. అధిక ఓట్లు సాధించిన వారిలో నాలుగో వ్యక్తిగానున్న నగరూరు రాఘవేంద్ర ఎలిమినేషన్ సమయంలో టిడిపి అభ్యర్థికి వైసిపికి మించి స్వల్ప మెజార్టీ వచ్చింది. పిడిఎఫ్ అభ్యర్థి నాగరాజు ఎలిమినేషన్ సమయంలో జరిగిన ద్వితీయ ఓట్ల లెక్కింపుతో టిడిపికి పూర్తి స్థాయి విజయానికి చేరింది.

రీకౌంటింగ్‌కు వైసిపి పట్టు...

ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాత రీకౌంటింగ్ చేయాలని వైసిపి అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి పటుబట్టారు. అలా చేయడానికి వీల్లేదని ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి చెప్పడంతో చేయాల్సిందేనంటూ కౌంటింగ్ కేంద్రం ఆవరణంలో బైటాయించి నిరసన తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచే వైసిపి నాయకులు కౌంటింగ్‌లో ఏదోక వివాదాన్ని రాజేసే ప్రయత్నం చేస్తూ వచ్చారు. గురువారం రాత్రే కొంత మంది యువకులను తీసుకొచ్చి ఎటువంటి కారణం లేకుండానే ఘర్షణకు దిగారు. దీంతో వారిని పోలీసులు బయటకు తీసుకెళ్లారు. ఆ తరువాత శుక్రవారం రాత్రి కూడా వైసిపి అభ్యర్థి టిడిపి నాయకులు కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చారంటూ వివాదానికి దిగారు. కౌంటింగ్ తరువాత తిరిగి రికౌంటింగ్ చేయాలని పట్టుబట్టారు. అయితే ఎన్నికల అధికారిగానున్న అనంతపురం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఇందుకు అంగీకరించలేదు. టిడిపి అభ్యర్థి రాంగోపాల్‌రెడ్డి గెలిచినట్లు ప్రకటించారు.

చెల్లని ఓట్లు ఎనిమిది శాతం

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలో మొత్తం 3.30 లక్షల ఓట్లు ఉన్నాయి. ఇందులో 74 శాతం అంటే 2,45,687 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 19,239 ఓట్లు చెల్లని ఓట్లుగా కౌంటింగ్‌లో తొలగించారు. పోలైన ఓట్లలో సుమారు ఎనిమిది శాతం ఓట్లు చెల్లని ఓట్లుగా ఉన్నాయి. వీటిల్లో చూసినప్పుడు పట్టభద్రులు ఓటింగ్ సరైన పద్ధతిలో చేయకపోవడంతోనే చెల్లని ఓట్లుగా నిర్ధారించారు. ఇందులో జరిగిన తప్పిదాలు చూస్తే ఒకే ప్రాధాన్యతలు ఇద్దరికివ్వడం, మరికొంత మంది అభ్యర్థుల ఎదుట సంఖ్యలు కాకుండా టిక్కులు పెట్టడం, మరికొంత మంది బ్యాలెట్ పేపరును మడిచి దానిపై తాము వేయాలనుకున్న అభ్యర్థులకు సంబంధించిన అంకెలను వేసియున్నారు. ఇటువంటి కారణాలతో వేసిన ఓట్లు చెల్లకుండా పోయాయి.

పోలీసు భారీ భద్రత

ఓట్ల లెక్కింపు ప్రధాన పార్టీల మధ్య హోరాహోరీగా సాగుతుండటంతోపాటు, రెండు పర్యాయాలు వివాదాలు చెలరేగడంతో పోలీసు భద్రతను కౌంటింగ్ కేంద్రం వద్ద భారీగా ఏర్పాటు చేశారు. చిన్న ఘటన జరిగిన వెంటనే వారిని బయటకు పంపించే విధంగా పోలీసు భద్రతను కట్టుదిట్టడం చేయడంతో కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగింది.

ఎమ్మెల్సీ గెలుపుపై రాయదుర్గంలో టిడిపి శ్రేణుల సంబరాలు

అకాల వర్షం..అపార నష్టం..

నేల రాలిన మామిడి, చీనీ, దానిమ్మ కాయలు

ప్రజాశక్తి-పుట్లూరు

పుట్లూరు మండలంలో శనివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడి వడగండ్ల వాన కురిసింది. మండలంలోని పుట్లూరు, బాలాపురం, పి.చింతలపల్లి, కోమటికుంట్ల, నారాయణరెడ్డి పల్లి, మడ్డిపల్లి తదితర గ్రామాల్లో గాలివానకు అరటిచెట్లు నేలకొరిగాయి. చీని, దానిమ్మ తోట రైతులకు కూడా నష్టం వాటిల్లింది. పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. మడ్డిపల్లిలో చెట్టు కొమ్మలు విరిగి ట్రాక్టర్ మీద పడడంతో పాక్షికంగా దెబ్బతింది. అకాల వర్షంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు.

గాలివానతో కూడిన వడగండ్ల వర్షం కురవడంతో నాయనపల్లి క్రాస్‌లో నర్సరీ

శింగనమల : మండలంలో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. మామిడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. గోవిందరాయునిపేట గ్రామానికి చెందిన రైతు శంకర్‌రెడ్డికి చెందిన ఎనిమిది ఎకరాల్లోని మామిడి, నేరేడు పంటకు నష్టం వాటిల్లింది.

నార్పల : మండలంలో శనివారం కురిసిన అకాల వర్షానికి వందల ఎకరాల్లో అరటి, నారింజ, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. వెంకటాంపల్లి గ్రామంలో రైతు మాధవీలతకు చెందిన నారింజ పంట నేలపాలు అయింది. నరసాపురం గ్రామానికి చెందిన రైతు ఓబులేసుకు చెందిన మామిడి తోటలోని కాయలు నేలరాలాయి. మామిడి చెట్లు కూడా నేలకొరిగాయి. చాములూరు గ్రామంలో టమోటా, మొక్కజొన్న, మిరప పంటలకు నష్టంవాటిల్లింది. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. వ్యవసాయ అధికారి ముస్తఫా, ఉద్యాన అధికారి ఫజులున్నీషా మండలంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని తెలియజేశారు.

బుక్కరాయసముద్రం : మండలంలో శనివారం కురిసిన అకాల వర్షాలకు వందలాది ఎకరాల్లో అరటి, మొక్కజొన్న, నారింజ, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. కొర్రపాడు, చదుళ్ల గ్రామంలో చేతికొచ్చిన అరటి, మొక్కజొన్న పంటలు పూర్తిగా నేలవాలిపోయాయి. రైతులకు భారీ నష్టం వాటిల్లింది. మండల వ్యవసాయ అధికారి శ్యామసుందర్‌రెడ్డి, ఉద్యాన అధికారి శైలజ మండలంలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. నష్ట నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని తెలియజేశారు.

బొమ్మనహాల్ : మండలంలోని గోవిందవాడ, దర్గాహొన్నూర్, బల్లలగుడం, కళ్లుహోళ, కళ్లు దేవనహళ్లి, బండూరు గ్రామాల్లో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను రాయదుర్గం వ్యవసాయ ఎడి లక్ష్మీనాయక్, ఉద్యానవన అధికారి దస్తగిరి శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా ధ్వంసమైన పంటలతోపాటు తడిసిన మిరప పంటను పరిశీలించి రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట తడిసి నష్టపోయిన రైతులు తమ పరిధిలోని ఆర్‌బికెల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ మండలంలో తడిసిన మిరప పంటను పరిశీలిస్తున్న అధికారులు, శింగనమల, పుట్లూరులో నేలకొరిగిన మునగ, జొన్న పంటలు

అభివృద్ధి పాలన చేశాం

మోకాళ్లపై కూర్చొని వికలాంగుడితో మాట్లాడుతున్న నారా లోకేష్

కియా ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉపాధి
వైసిపి పాలనలో ఉన్న పరిశ్రమలూ తిరోగమనం
యువగళం పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి-తనకల్లు, నల్లచెరువు, కదిరి టౌన్, అర్బన్

టిడిపి హయాంలో ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధి జరిగేలా పాలన సాగిందని టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 46వ రోజు శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గంలోకి చేరుకుంది. శుక్రవారం నాడు తనకల్లు మండలానికి చేరుకున్న యాత్ర శనివారం నుంచి చీకటిమానిపల్లిలో బస చేసిన ప్రాంతం నుంచి లోకేష్ పాదయాత్ర కొనసాగించారు. జిల్లాలో మొదటి రోజు తనకల్లు, నల్లచెరువు మండలాల పరిధిలో కొనసాగింది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే, కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా ఆధ్వర్యంలో లోకేష్‌కు అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. లోకేష్ పాదయాత్ర చేస్తూ ఆయా ప్రాంతాల్లో ప్రజలను పలకరిస్తూ, మాట్లాడుతూ ముందుకు నడిచారు. గిరిజన, దళిత కుటుంబ సభ్యులతో ముఖాముఖి నిర్వహించారు. తనకల్లు మండలం గంగసానిపల్లి వద్ద టమోటా రైతులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాల్లో లోకేష్ ప్రసంగించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఎంతో కషి చేసిందన్నారు. ఆ కషి ఫలితమే పెనుకొండ వద్ద ప్రపంచ స్థాయి కియా కార్ల పరిశ్రమ ఏర్పాటు అయ్యిందన్నారు. జాకీ కంపెనీ వస్తే కమీషన్ల కోసం దానిని వైసిపి నాయకులు అడ్డుకున్నారని చెప్పారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఐటీ పరిశ్రమను ఎంత అభివద్ధి చేశారని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఒక్క పరిశ్రమ అయినా తెచ్చారాని ప్రశ్నించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక పరిశ్రమలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. నిరుద్యోగుల కోసం ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, కదిరి మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, అత్తార్ చాంద్‌బాషా, తిప్పేస్వామి, తెలుగు యువత నాయకులు ఎస్.బాబ్జాన్, ఎంఎస్.రాజుతో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లచెరువు : తలమర్లవాండ్లపల్లి గ్రామపంచాయతీ ఎర్రగుంటపల్లి వద్ద శనివారం సాయంత్రం లోకేష్ పాదయాత్ర నల్లచెరువు మండలంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పాదయాత్ర సందర్భంగా చిన్నపల్లోళ్లపల్లి వద్ద నారా లోకేష్ రాత్రి బస చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రాజశేఖర్, మాజీ ఎంపిపి మాబు సాబ్, మాజీ జెడ్పిటిసి అబ్దుల్ ఖాదర్, నల్లచెరువు సింగల్ విండో మాజీ అధ్యక్షుడు తవలం వేణుగోపాల్, అంజనప్ప, సీనియర్ నాయకులు నాగభూషణ నాయుడు, లక్ష్మీపతి నాయుడు, తలమర్లవాండ్లపల్లి సర్పంచి హర్షవర్ధన్ నాయుడు, రమేష్ నాయుడు, మదన్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంటపల్లిలో స్వల్ప ఉద్రిక్తత.. జై జగన్ అంటూ వైసిపి నేతల నినాదాలు

నల్లచెరువు మండల పరిధిలోని తలమర్లవాండ్లపల్లి గ్రామపంచాయతీ ఎర్రగుంటపల్లి వద్ద తనకల్లు నుంచి లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్ర వద్ద స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. పాదయాత్ర ఎర్రగుంటపల్లి గ్రామం వద్దకు రాగానే అదే గ్రామానికి చెందిన మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ తవలం నాగభూషణ, మరి కొంతమంది జై జగన్ అని నినాదాలు చేశారు. దీంతో కొంత ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. వెంటనే పోలీసులు కలుగజేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు.

నేటి పాదయాత్ర ఇలా...

కదిరి టౌన్ : లోకేష్ పాదయాత్ర ఆదివారం 47వ రోజు నల్లచెరువు మండలంలో కొనసాగనుంది. ఉదయం 8గం॥లకు చినపిల్లోలపల్లి విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభం అవుతుంది. 8-15కు సంజీవుపల్లిలో స్థానికులతో మాటామంతి, 10-05కు నల్లచెరువులో చేనేతలతో సమావేశం, 10-45కు ఘాజీఖాన్ పల్లి వద్ద స్థానికులతో మాటామంతి ఉంటుంది. 11-50కు పయాలవారిపల్లిలో భోజన విరామం, 2-25కు పయాలవారిపల్లి నుంచి పాదయాత్ర ప్రారంభం అవుతుంది. 2-45కు నల్లచెరువు రైల్వేస్టేషన్ వద్ద స్థానికులతో మాటామంతి, 3గం॥లకు యువగళం పాదయాత్ర 600 కిలోమీటర్లకు చేరుతుంది. 3-25కు రత్నాలపల్లిలో కురుబ సామాజికవర్గీయులతో భేటీ, 4-05 గంటలకు బొమ్మిరెడ్డిపల్లిలో స్థానికులతో మాటామంతి నిర్వహిస్తారు. 4.40కు చిన్నయాళ్లంపల్లిలో 600 కిలోమీటర్ల పాదయాత్ర సందర్భంగా శిలాఫలకం ఆవిష్కరణ చేశారు. 5గంటలకు జోగన్నపేట బహిరంగసభలో లోకేష్ ప్రసంగిస్తారు. 6 గంటలకు జోగన్నపేట విడిదికేంద్రంలో బస చేస్తారు.

ప్రజలకు అభివాదం చేస్తున్న నారా లోకేష్

శింగనమల మండలం నాయనపల్లి క్రాస్ వద్ద పొలాల్లో పడిన వడగండ్లు

ప్రజాశక్తి
www.prajasakti.com

పల్లకిలో స్వామివారి ఊరేగింపు

లక్ష్మీనారసింహుడి పల్లకిసేవ

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ మండల పరిధిలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారి పల్లకి సేవ శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి పల్లకిలో మేళతాళాల మధ్య ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో విజయ్ కుమార్, ఆలయ అర్చకులు ద్వారకానాథ్ స్వామి, బాలాజీ స్వామి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

చేతి బోరుకు మరమ్మతులు

నార్పల : నార్పల మండల కేంద్రంలోని గాంధీ సర్కిల్‌లో ఉన్న చేతి బోరింగుకు గ్రామ పంచాయతీ సిబ్బంది శనివారం మరమ్మతులు చేపట్టారు. చేతిపంపు మరమ్మతుకు గురవడంతో స్థానిక వ్యాపారులు నీటి కోసం ఇబ్బందులు పడ్డారు. సమస్యను వారు సర్పంచి సుప్రియకు, పంచాయతీ సెక్రెటరీ అశ్వర్థ నాయుడుకు విన్నవించారు. స్పందించిన వారు చేతి బోరింగుకు మరమ్మతులు చేపట్టారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పుట్లూరు : అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు మండలంలోని అనేక గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలు, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయన్నారు. గతంతో కూడా వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ఇంతవరకు ఎలాంటి పరిహారం అందలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి విటి.రామాంజినేయులు, మండల సహాయ కార్యదర్శి ఎస్.సూరి, మండల నాయకులు జి.వెంకటచౌదరి, నాగభూషణం, వెంకటశేఖర్, పూలరంగడు, నాగసుబ్బరాయుడు, నాగమునేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై జెసి.అస్మిత్ ఆరా..

పెద్దవడుగూరు : మండలంలోని రావులుడికి, కోనాపురం గ్రామాల్లో టిడిపి తాడిపత్రి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జెసి అస్మిత్ రెడ్డి పర్యటించి పలు సమస్యలపై ఆరాతీశారు. ప్రస్తుతం గ్రామాల్లో అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న మహిళలు, చిన్నారులు, వృద్ధులు, యువకులు, నిరుద్యోగులను ఆయన పలకరించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో కొందరు మహిళలు పింఛన్లు ఇవ్వకుండా ఉన్నారని ఆయన దృష్టికి తీసుకురాగా కారణాలు తెలుసుకున్నారు. టిడిపి ప్రభుత్వం వచ్చాక పింఛను వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామకృష్ణారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, మండల నాయకులు కేశవరెడ్డి, దివాకరరెడ్డి, వెంకట్రామిరెడ్డి, రమేష్ యాదవ్, చిరంజీవులు, ముత్యాలు, నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు

ఉరవకొండ : సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని ఉరవకొండ పట్టణ శివారులో ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరం, దగ్గుతో బాధ పడుతున్న విద్యార్థినులకు రక్త పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. 64 మంది విద్యార్థులకు వైద్య చికిత్సలు చేశారు. విద్యార్థినులు, బోధన, బోధనేతర సిబ్బందికి హెచ్3, ఎన్2, ఇన్‌ఫ్లూఎంజా వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించారు. ఈ వ్యాధులు ప్రబలకుండా చేతులు తరచూ శుభ్రపరుచుకోవాలని, మాస్క్ ధరించాలని, దగ్గినప్పుడు తుమ్మినప్పుడు చెయ్యి అడ్డం పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి టి.సాహితీ, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ కె.భారతి, వైస్ ప్రిన్సిపల్ ఎం.జయమ్మ, ఆరోగ్య సిబ్బంది నిమ్మల వెంకటేష్, మోతీలాల్ నాయక్, హెల్త్ ప్రొవైడర్ సులోచన, ఆశా కార్యకర్త మేరీ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

BEFORE THE HON'BLE IIIrd ADDL JUNIOR CIVIL JUDGE,CUM-SPL PRO & EXCISE COURT JUDE: ANANTAPURAMU.
O.S.No. 1355/2019.

Between:
Shoba Rani @Soba Rani ... **Plaintiff**
AND
J.Mallikarjuna Reddy ...**Defendant**

Notice to Defendant.

J.Mallikarjuna S/o Late Thippa Reddy, residing at Marakunta Palli Village, Kothacheruvu Mandal, Ananthapuramu Dist.
ఇందుమూలముగా తెలియజేయడము ఏమనగా ప్రతివాది హాజరు నిమిత్తం పై కోర్టు నందు 28/04/2023 వ తేదిన వాయిదా ఉన్నది. కావున పై తేది రోజున ఉదయం 10:30 గంటలకు మీరు స్వతహాగ గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించెదరు.

(By order of the court)
యస్.కె.చంద్రశేఖర్, హెచ్.ఎల్.భాస్కర్ నాయక్
అడ్వకేట్స్, అనంతపురం.

‘పివికెకె’లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక రుద్రంపేటలోని పివికెకె ఇంజినీరింగ్ కళాశాలలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం’ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల కరెస్పాండెంట్ డా.పల్లెరఘునాథ రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ పల్లె కిశోర్ మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, కళాశాలకు మధ్య సన్నిహిత సంబంధాలను పెంపొందించే లక్ష్యంతో నేడు పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాల ఈ బృహత్తర కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల పూర్వ విద్యార్థుల ద్వారా ప్రస్తుత విద్యార్థులు కళాశాల విద్యాభ్యాసం తరువాత నిజజీవితంలో ఎదురయ్యే సవాళ్లు, వాటి కోసం తాము తీసుకున్న నిర్ణయాలు, వాటి తీపి-చేదు అనుభవాలు, వారి సలహాలు, సూచనలు, సంబంధిత రంగాలపై, దాని లోతుపాతులపై పూర్తిస్థాయి అవగాహన పొందేందుకు, సామూహిక సంబంధాలను మెరుగుపర్చుకోవటానికి దోహదపడుతుందన్నారు. ఒకే విధమైన ఆసక్తులు కలిగిన విద్యార్థులంతా కలిసి తమ జీవితంలో పూర్తి ఉత్సాహంతో విజయమార్గంలో పయనించడానికి వీలు కల్పిస్తుందని తెలిపారు. తరువాత సెమినార్లు, వర్క్‌షాప్‌లు, సామాజిక కార్యక్రమాలతో సహా అనేక రకాల కార్యకలాపాలు నిర్వహించారు. చాలా రోజుల తర్వాత కలుసుకున్న అనంతరం ఆనాటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒకే వేదికపైకి చేరుకుని జ్ఞాపకాలను, మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా, మరికొందరు వ్యాపార రంగంలో, ఉపాధ్యాయులుగా, పోలీసు వృత్తిలో, మరికొందరు వ్యవసాయధారులుగా స్థిరపడ్డారు. వాళ్లంతా ఒకచోట చేరి ఆలింగనం చేసుకుంటూ సంతోషంతో ఉప్పొంగిపోయారు. ఒకరినొకరు పరిచయాలు చేసుకుంటూ, ఆటలు, పాటలు, సామూహిక భోజనాలు చేసి ఒకరి కష్ట సుఖాలు మరొకరు పంచుకున్నారు. తాము ఎప్పటికీ కలిసి ఉండాలని, తమ స్నేహం నేటి యువతకు ఆదర్శంగా ఉండాలని, కష్టకాలంలో అందరం తోటివారికి సహాయం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. బాధ్యతాయుతమైన పౌరులుగా, తల్లిదండ్రులుగా తమ పిల్లలకు నైతిక విలువలు, బాధ్యతాయుత ప్రవర్తన అలవడేలా పెంచాలని సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల మధ్య సత్సంబంధాలు పెరిగేందుకు పూర్వవిద్యార్థుల సమ్మేళనం వంటి కార్యక్రమంలో ఎంతో దోహదపడతాయని వివరించారు. పూర్వవిద్యార్థులు నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి పల్లె సింధూర, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపల్ డా.బండి రమేష్‌బాబు, ఏవో మనోహర్‌రెడ్డి, అలమ్ని ఇన్‌ఛార్జి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాల యాజమాన్యంతో పూర్వ విద్యార్థులు

ఏప్రిల్ 5న కార్మిక, రైతాంగ సమస్యలపై చలో ఢిల్లీ

జయప్రదం చేయాలని 19 నుంచి 26 వరకు జీపు జాతా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కార్మిక, రైతాంగ సమస్యలపై ఏప్రిల్ 5న నిర్వహిస్తున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎస్.నాగేంద్రకుమార్, ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, ఎం.బాల రంగయ్య, ఎం.కృష్ణమూర్తి తెలిపారు. శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, కార్మికుల హక్కులను హరిస్తున్న చర్యలను వ్యతిరేకిస్తూ సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మార్చి 19వ తేది నుంచి 26వ తేది వరకు జిల్లా వ్యాప్తంగా జీపు జాతా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మతం పేరుతో ప్రజలు విడదీసి పాలిస్తోందన్నారు. అంబానీ, అదాని వంటి కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. కార్మిక హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తుంగలోతొక్కిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశా వంటి స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరలు కల్పించాలని, మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలని కోరారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పగడ్బందీగా అమలుచేసి సంవత్సరానికి 200 రోజుల పనులు, రోజువారీ వేతనం రూ.600లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

20న మెడికోల ఫ్రెషర్స్ డే

మెడికల్ కళాశాలల్లో ఫ్లాష్ మ్యాబ్

ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ ఆరేపల్లి శ్రీదేవి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

మెడికల్ కళాశాలలో ఈనెల 20న ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు ఫ్రెషర్ డే జరగనున్న నేపథ్యంలో కళాశాల అధ్యాపకులను, అధ్యాపకేతర సిబ్బందిని, సీనియర్ మెడికోలను, పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్లను, హౌస్ సర్జన్లను ఆహ్వానిస్తూ 2020 బ్యాచ్ విద్యార్థినీ విద్యార్థులు చేసిన ఫ్లాష్ మ్యాబ్ డాన్సులు మెడికల్ కళాశాలలోని అందరిని అలరించాయి. నాటు నాటు.. ఆటకావాలా పాటకావాలా.. చూపులతో గుచ్చి గుచ్చి.. గాజువాక పిల్ల... పల్సర్ బైక్... ఒసేయ్ రాములమ్మ.. లాంటి పాటలతో వైద్య విద్యార్థులు చేసిన నత్యాలు ఆడిటోరియం గ్రౌండ్‌లో హోరెత్తించాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రూపొందించిన ప్రోమోను కళాశాల వైస్ ప్రిన్సిపల్ లు ఆచార్య డాక్టర్ షారోన్ సోనియా, ఆచార్య డాక్టర్ కెఎల్.సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ఆచార్య డాక్టర్ ఆత్మరామ్, కల్చరల్ కమిటీ ఇన్‌ఛార్జి డాక్టర్ శైలజ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నిహారిక, డాక్టర్ శ్యాంప్రసాద్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ అబ్దుల్ మజీద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సజ్జలకు సిగ్గులేదు..ఇది ప్రజా విజయం..

మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్

గుంతకల్లులో టిడిపి సంబరాలు

ప్రజాశక్తి-గుంతకల్లు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి మద్దతుదారులు గెలుపుపై సకల శాఖల మంత్రి సజ్జలు చేసిన వ్యాఖ్యలు సిగ్గు చేటని, విద్యా వంతులు, మేధావులు సిఎం జగన్ రెడ్డి అహంకారాన్ని దించేందుకు సరైన నిర్ణయం తీసుకున్నారని ఇది ప్రజా విజయమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్ర గౌడ్ అన్నారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి మద్దతుదారుడు భూమిరెడ్డి రాంభూపాల్‌రెడ్డి గెలుపును మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు శనివారం విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. జితేంద్రగౌడ్ క్యాంపు కార్యాలయంలోనూ, పొట్టి శ్రీరాములు కూడలిలోనూ, ఎన్టీఆర్ విగ్రహం వద్ద, టిడిపి కార్యాలయంలో కేకులు కోసి తినిపించుకుని, బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి నిరంకుశ పాలనపై విసుగుచెందిన పట్టభద్రులు చంద్రబాబు పాలనను కోరుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు ప్రాంతాల్లో టిడిపి మద్దతుదారులకు విజయాన్ని అందించారని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచేందుకు వైసిపి నాయకులు ఎన్ని కుట్రలు చేసినా చివరకు విద్యావంతులు సిఎం జగన్‌రెడ్డికి సరైన గుణపాఠం చెప్పారని అన్నారు. ఈ గెలుపు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి గెలుపుకు నాంది అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌కుమార్ గౌడు, నాయకులు కేసప్ప, మస్తానప్ప, ప్రతాప్ నాయుడు, జింకల జగన్నాథ్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : టిడిపి పట్టభద్రుల ఎమ్మెల్సీగా భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి గెలుపొందడంతో పెద్దవడుగూరులో ఆపార్టీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయారు. పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చారు.

పుట్లూరు : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి రాంగోపాల్‌రెడ్డి విజయం సాధించడంతో టిడిపి నాయకులు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గరికపాటి సుదర్శన్ నాయుడు, నాయకులు రవిచంద్ర నాయుడు, రామాంజినేయులు, ఆదినారాయణరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, లక్షుమయ్య, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి విజయం సాధించడంతో టిడిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. నార్పల మండల కేంద్రంలోని గాంధీ సర్కిల్‌లో అలం సోదరుల ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిట్టు రంగారెడ్డి, తెలుగు యువత చంద్రబాబు, ప్రకాష్, నరసాపురం నాగేష్, చంద్రబాబు, తుంపెర రాధాకృష్ణ, నాగేష్, రామానాయుడు, జాఫర్ వలి, మురళి, హరీష్, మహేష్, గణేష్, జగదీష్, మంగల రామాంజి పాల్గొన్నారు.

అనంతపురం వాసులకు ఉగాది పురస్కారాలు

ప్రజాశక్తి-అనంతపురం

అనంత వేదికగా వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న జిల్లా ప్రముఖులకు ఉగాది పురస్కారాలు అందించారు. శ్రీ జి ప్రకృతి ధర్మపీఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ప్రముఖ క్రీడాకారుడు పద్మభూషణ్ పుల్లెల గోపీచంద్, ట్రస్ట్ నిర్వాహకులు శ్రీనివాస్, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డి, డిఎస్‌పి హనుమంతు, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, ఆదరణ రామకృష్ణ తదితరులు ఆత్మీయ అతిథులుగా విచ్చేసి మాట్లాడారు. అనంత జిల్లాను కరువు బారి నుండి రక్షించుకోవాలంటే విరివిగా చెట్లను పెంచాలని సూచించారు. ప్రతి ఇంట మొక్కలు నాటి వాటిని రక్షించుకుంటేనే భవిష్యత్ తరాల వారికి అందమైన భవిత ఉంటుందన్నారు. అనంతరం సాహిత్య భారతి కార్యదర్శి సుంకర రమేష్, సీనియర్ న్యాయవాది పద్మజ, బ్రహ్మకుమారి సిస్టర్ శారద, బిఎస్ఎన్ఎల్ రాజశేఖర్‌రెడ్డి, నెహ్రూ యువ కేంద్రం శ్రీనివాస్ తదితరులకు ఉగాది పురస్కారాలు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రకృతి ధర్మపీఠం నిర్వాహకులు వెంకటేష్, ఆదిరెడ్డి పరదేశినాయుడు, రియాజుద్దీన్, సఫారే రాజశేఖర్, కరణం హరికిషోర్, గాజుల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పుసరస్కారాలు అందజేస్తున్న దృశ్యం

పోలీస్‌స్టేషన్‌కు నూతన భవనం నిర్మించండి

హోం మంత్రిని కోరిన ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

హోం మంత్రికి వినతిచేస్తున్న ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ పట్టంలో ఉన్న పోలీస్‌స్టేషన్ శిథిలావస్థకు చేరుకుందని, దాని స్థానంలో నూతన భవనం నిర్మించాలని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనితను కోరారు. విజయవాడలోని సచివాలయంలో హోంమంత్రిని ఎమ్మెల్సీ శివరామిరెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉరవకొండ పట్టణంలో పోలీస్‌స్టేషన్ శిథిలావస్థలో ఉందని, నూతన భవనం నిర్మించుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా శివరామిరెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇటీవల రూరల్, టౌన్ పోలీస్ సర్కిళ్లను ఏర్పాటు చేస్తూ ఇద్దరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను కేటాయించారన్నారు. ఉరవకొండలో రూరల్, అర్బన్ పోలీస్‌స్టేషన్లు రెండూ పాతబడ్డాయన్నారు. ఒకే పోలీస్‌స్టేషన్ భవనంలో విధులు నిర్వహించడం ఇబ్బందికరంగా ఉందన్నారు. ఉరవకొండ పట్టణంలో అర్బన్, రూరల్ పోలీస్ స్టేషన్లను విడిగా ఏర్పాటు చేస్తూ.. వాటికి కొత్త భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు కావలసిన నిధులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. స్పందించిన హోం మంత్రి నూతన పోలీస్‌స్టేషన్ భవనాలు నిర్మించడానికి నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.

ఆటల్లో రాణించాలి : సిఐ

ప్రజాశక్తి-ఉరవకొండ

క్రీడాకారులు గెలుపే ధ్యేయంగా పట్టుదలతో రాణిస్తే విజయం సాధించవచ్చని ఉరవకొండ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శేఖర్ పేర్కొన్నారు. శనివారం విడపనకల్ మండల కేంద్రంలో విఐఎల్ 2023 ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్‌ను సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శేఖర్ మేనేజ్‌మెంట్ నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలల్లో క్రీడాకారులను వెలికితీసే విధంగా నిర్వాహకులు గిరిబాబు, విన్నర్ ప్రైస్ దాత త్రినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించి ప్రోత్సహిస్తున్నారని అభినందించారు. క్రీడల ద్వారా స్నేహ సంబంధాలు పెంపొందుతాయని అన్నారు. మానసికంగా, శారీరకంగా ధృఢంగా ఉండవచ్చని అన్నారు. విన్నర్ ప్రైజ్ రూ.30 వేలు, రన్నర్ ప్రైజ్ రూ.15 వేలు విజేతలకు అందజేయడంతో పాటు షీల్డ్ కూడా ఇచ్చి క్రీడాకారులను ప్రోత్సహించడం మంచి పద్ధతి అన్నారు. ఈ పోటీలలో 40 క్రీడా జట్లు పాల్గొన్నట్లు మేనేజ్‌మెంట్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దేశాయి సిద్ధార్థ, నిర్వాహకులు రఘు, వెంకటేశులు, వీరు, మహేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గార్లదిన్నె : గార్లదిన్నె మండల పరిధిలోని కణంపల్లి గ్రామం వద్ద 44 జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాదుకు చెందిన సూర్యతేజ (24) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాదుకు చెందిన సూర్యతేజ కారులో బెంగళూరుకు బయలుదేరాడు. కణంపల్లి గ్రామం వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సూర్యతేజకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మరణించాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ గురుమూర్తి తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

పుట్లూరు : గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని ఎ.కొండాపురం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు. అతను చనిపోతూ ధర్మవరం అని చెప్పారని తెలుస్తోంది. ఎవరికైనా సమాచారం తెలిస్తే 9440901890, 9440796862 నెంబర్లకు ఫోన్ చేయాలని ఎస్ఐ తెలిపారు.

పురాతన వీరభద్రస్వామి విగ్రహం చోరీకి యత్నం

ప్రజాశక్తి-పుట్లూరు

ఓ దేవాలయంలోని పురాతన వీరభద్రస్వామి విగ్రహం చోరీ యత్నానికి పాల్పడిన సంఘటన పుట్లూరు మండలం కడవకల్లు గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. కడవకల్లు గ్రామంలో ఓ పురాతన వీరభద్రస్వామి ఆలయం ఉంది. శుక్రవారం రాత్రి ఆలయంలోని వీరభద్రస్వామి విగ్రహాన్ని అపహరించడానికి దుండగులు విఫలయత్నం చేశారు. విగ్రహాన్ని ఆలయం నుండి 30 అడుగుల దూరం తీసుకెళ్లి అక్కడే వదిలేసి వెళ్లారు. దుండగులు వదిలేసి వెళ్లిన విగ్రహాన్ని శనివారం ఉదయం ఆలయ అర్చకులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు.

నిరసన తెలుపుతున్న సత్యసాయి వాటర్ సప్లై కార్మికులు

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సత్యసాయి కార్మిక సంఘం ఉపాధ్యక్షులు బాలకృష్ణ

ప్రజాశక్తి-ఉరవకొండ

కార్మికుల సమస్యలు పరిష్కరించి ఉద్యోగ భద్రత కల్పించాలని సత్యసాయి వాటర్ సప్లై యూనియన్ ఉపాధ్యక్షులు బాలకృష్ణ పేర్కొన్నారు. శనివారం ఉరవకొండ మండల పరిధిలోని పెద్ద కౌకుంట్ల గ్రామంలో ఉన్న సత్యసాయి వాటర్ సప్లై పంపుహౌస్ వద్ద కార్మికులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రావాల్సిన బోనస్ లీవ్ లు, గ్రాట్యుటీ చెల్లించే వరకు సమ్మె విరమించేది లేదన్నారు. నెలలు తరబడి జీతాలు ఇవ్వకున్నా ప్రజల దాహార్తిని తీరుస్తున్న కార్మికుల కుటుంబాల గురించి మాత్రం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లన్న, శీనప్ప, బొజ్జప్ప, ఎర్రిస్వామి, సూరి, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఇంగ్లీష్-2 పరీక్షకు 637 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

నాలుగో రోజు శనివారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు 637 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఆర్ఐఒ సురేష్ బాబు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 29,972 వేలమంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 29,335 వేల మంది హాజరయినట్లు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 99 పరీక్ష కేంద్రాల్లో ఒకేష నల్ కోర్సు ఇంగ్లీష్ పరీక్షకు 2748 మందికి గాను 2659 మంది హాజరయ్యారు. 89 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. ఇంటర్మీడియట్ జనరల్ కేటగిరీలో నిర్వహించిన పరీక్షకు 27,724 మందికి గాను 26,676 మంది విద్యార్థులు హాజరయ్యారు.548 మంది గైహాజర యినట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షల్లో ఎటువంటి మాల్ ప్రాక్టీసు లేవని ఆర్ఈవో అన్నారు. సిట్టింగ్, ఫ్లేయింగ్ స్క్వాడ్‌లు, డిఇసి మెంబర్లు, హైపవర్ కమిటీ మెంబర్ లు, జిల్లా అబ్జర్వర్స్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలోకి నిముషం ఆలస్యమైనా నో ఎంట్రీ అనే నిబంధన వల్ల విద్యార్థులు 8 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలీసులు పరీక్ష కేంద్రాలు వద్ద గట్టి బందోబస్తు నిర్వహించారు. పరీక్ష కేంద్రాల చుట్టు పక్కల జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు. సెంటర్ల వద్ద మెడికల్ సిబ్బందిని కూడా ఉంచారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. మూడో రోజు ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని ఆర్ఐఒ తెలిపారు.

పాత డీఈవో కార్యాలయంలో మరమ్మతు పనులు

భవనాన్ని పరిశీలించిన ఈఈ శివకుమార్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

అనంతపురం నగరంలోని కమలానగర్‌లో ఉన్న పాత డీఈవో ఆఫీస్ మరమ్మతులకు విద్యాశాఖ చర్యలు తీసుకుంది. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరాం ఆదేశాల మేరకు ఏపీఈడబ్ల్యూఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శివకుమార్ సాయంత్రం పాత డీఈవో ఆఫీస్‌ని పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న భవనానికి పైన స్లాబు వేసి, కింద పైన మరుగుదొడ్లు నిర్మించి, భవనం మొత్తానికి మరమ్మతులు చేసి రంగులు వేయడానికి దాదాపు రూ.10 లక్షలు నుంచి రూ.15 లక్షలు ఖర్చు అవుతుందని, బిల్డింగ్ మొత్తం పడగొట్టి 6 ఫ్లోర్లు కట్టడానికి దాదాపు రూ.4 కోట్లకు పైగా ఖర్చు అవుతుందని ఈఈ తెలిపారు. రెండు ప్రతిపాదనలను విద్యాశాఖ అధికారులకు పంపిస్తామని చెప్పారు. దేనికి అనుమతి వస్తే ఆ పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ రమణారెడ్డి, ఏఈ రాజశేఖర్‌రెడ్డి, విద్యాశాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

మృతుల కుటుంబాలకు జనసేన జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ సంతాపం

ప్రజాశక్తి-అనంతపురం

ప్రమాదాల నివారణపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు వచ్చేందుకు సరిపడా బస్సులు లేకపోవడం వల్లే జిల్లాలో నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ఈ నేపథ్యంలో చోటు చేసుకున్న ధర్మవరం ప్రమాద ఘటన దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు. కూలి పనులు చేసుకుని బత్తలపల్లి నుంచి ధర్మవరానికి వస్తున్న ఆటో మార్గమధ్యంలో ప్రమాదానికి గురై అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు కూలీలు మృతి చెందడం తనను కలచివేసిందన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం ఉంటే ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకోవన్నారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. మెరుగైన ఆర్థిక పరిహారం అందించడంతోపాటు గాయపడిన ముగ్గురికి నాణ్యమైన వైద్య చికిత్సలు అందించాలని టిసి.వరుణ్ కోరారు.